క్లుప్తంగా

నూకాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో రాజోలు నియోజకవర్గం నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నెలరోజుల పాటు జరిగే తీర్థంలో ఈ నెల 19వ తేదీతో ముగియనున్నాయి. ఆలయ ఈవో నాగ విష్ణు ఆధ్వర్యంలో చైర్మన్ సుందర నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సర్పంచ్ తాతాజీ, మాజీ చైర్మన్ సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి గోపాలకృష్ణ, సాగి కృష్ణంరాజు, దాట్ల బాబురాజు, సుందర పండు తదితరులు పాల్గొన్నారు.

చింతలూరులో..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూర, పరిసరాల ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో క్యూలన్నీ కిక్కిరిసి పోయాయి. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు కొనసాగించారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

మామిడికుదురు: పెదపట్నం రత్నాపురంలో కొలువుదీరిన గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ జాతర ఆద్యంతం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు 18వ తేదీ మంగళవారం వరకు జరుగుతాయని కమిటీ తెలిపింది. 17వ తేదీ అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, 18వ తేదీ మంగళవారం తీర్థం జరుగుతుందన్నారు.

సత్యసాయిబాబాకు రుద్రాభిషేకం

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట సాయిప్రభ మందిర్‌లో కొలువుదీరిన సత్యసాయిశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, నామ సంకీర్తన, గణపతి పూజ, సాయి గాయత్రి హోమం కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. సత్యసాయిబాబాకు 18 రకాల మంగళ అభిషేక ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిపించారు. కాకినాడ కుక్కుటేశ్వరరావు భక్త బందం 108 మందితో ఈ కార్యక్రమం ఆద్యంతం కనులపండువలా జరిగింది. మహా నారాయణసేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, డాక్టర్ కాశిన ప్రభాకర్, మంగెన సత్యగురు, గుర్రం చంటి, అడపా శ్రీకృష్ణ, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి నాగబాబు, రాజాబాబు పాల్గొన్నారు.

పోరాటానికి ప్రజలు అండగా నిలవాలి

మామిడికుదురు: బీజేపీ అవినీతిపైన, అదానీ కంపెనీల్లో జరిగిన అక్రమాలపైన రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలు అండగా నిలవాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కనఖ సామాజిక భవనంలో ఆదివారం పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ నేత ములపర్తి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌతమ్, ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ అవినీతిపై పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు కాంగ్రెస్‌ని వీడిన వారంతా తిరిగి పార్టీలోకి రావాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా సాగాలి

పి.గన్నవరం: కాపులు ఇతర వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని కాపు సంక్షేమ సేన రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు చినబాబు అన్నారు. ఆదివారం పి.గన్నవరంలో నియోజకవర్గ కాపు సంక్షేమ సేన కన్వీనర్ తాటికాయల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చినబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాపు సంక్షేమ సేన జిల్లా కన్వీనర్ తిక్కా శేషుబాబు, పోలిశెట్టి బాబులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది 'అగ్నిప్రమాదాలు–నివారణ చర్యలు' పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానికంగా పలు అపార్ట్‌మెంట్లలో నివాసితులకు గ్యాస్ ప్రమాదాలు–తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సిబ్బంది ప్రత్యక్షంగా గ్యాస్ సిలిండర్ డెమో చేసి, మహిళా వినియోగదారులతో పోర్టబుల్ అగ్నిమాపక సాధనాలు ఉపయోగించి మంటలను ఆర్పించడం వంటి చర్యల ద్వారా అవగాహన కల్పించారు.

సుకన్యతో సువర్ణ భవిత

- పదేళ్ల లోపు బాలికలు అర్హులు
- పోస్టల్‌శాఖ విస్తృత ప్రచారం
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం పదేళ్ల బాలికల కోసం పోస్టల్‌శాఖ ద్వారా భేటీ బచావో.. భేటీ పఢావో (ఆడపిల్లను రక్షించు.. ఆడపిల్లను చదివించు) సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం బాలికల అభ్యున్నతికి, బంగారు భ విష్యత్‌కు బాటలు వేస్తుంది. ఆడపిల్లల ఆర్థిక భద్రతే లక్ష్యంగా లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఎస్ఎస్‌వైపై ప్రజల్లో విశేష స్పందన లభిస్తుంది. ఈ పథకం గురించి పోస్టల్‌శాఖ విస్తృత ప్రచారం చేయడంతో అనేక మంది తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు పోస్టల్ ఖాతాను తెరుస్తున్నారు. అలాగే ఈ పథకంపై అవగాహన కోసం పోస్టల్ శాఖ గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. అమలాపురం డివిజన్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో హెడ్ పోస్టాఫీసులు 04, సబ్ పోస్టాఫీసులు 52 ఉండగా ఇప్పటి వరకూ సుకన్య పథకం కింద దాదాపు 15 వేల ఖాతాలు ఉన్నాయి.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ సుమారు 350 మంది బాలికలు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించారు. ఎస్ఎస్‌వై ఖాతా కాల పరిమితి పూర్తయిన 21 యేళ్ల తర్వాత చేతికి పొదుపు సొమ్ము లభిస్తుంది. 10వ తరగతి తర్వాత ఉన్నత విద్యకోసం, 18 ఏళ్లు నిండిన తర్వాత ఖాతాలోని 50 శాతం మొత్తాన్ని రుణంగా పొందే వీలుంటుంది.


చింతలూరు పోస్టాఫీసు

పన్ను రాయితీలు.., ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు

పోస్టల్ శాఖలో ఖాతాను ప్రారంభించిన తరువాత 21 సంవత్సరాల కాల పరిమితి తీరేవరకూ నిల్వ ఉన్న సొమ్ముకు వడ్డీ లభిస్తుంది. ఉదాహరణకు రెండు సంవత్సరాల బాలికకు సుకన్య సమృద్ధి అకౌంట్‌లో నెలకు రూ.1000 చొప్పున 15 సంవత్సరాలకు రూ. 1.8 లక్షలు పొదుపు అవుతుంది. తర్వాత ఆరు సంవత్సరాలకు కాలపరిమితి పూర్తయ్యిన 21 సంవత్సరాలకు 7.6 శాతం వడ్డీతో దాదాపు రూ.5.3 లక్షలు తల్లిదండ్రుల చేతికి వస్తుంది. ఈ పథకంలో నిల్వ చేసే సొమ్ముకు, వడ్డీకి పన్ను రాయితీ లభిస్తుంది. పోస్టాఫీసుకు రాలేని వారు ఖాతా ప్రారంభించిన తరువాత ఐపీపీబీ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చు. ఆడపిల్లల భవిష్యత్‌కు కొండంత అండగా ఈ సుకన్య సమృద్ధి యోజన పథకం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఎస్ఎస్‌వై ప్రయోజనాలు

- 10 సంవత్సరాలు లోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు లేదా సంరక్షకులు రూ.250 చెల్లించి పోస్టల్ ఖాతాను ప్రారంభించవచ్చు.
- కుటుంబానికి ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే అర్హులు.
- ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు.
- ఏడాదిలో గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చు.
- ఎస్ఎస్‌వై పథకం కింద ఖాతా ఉన్న వారికి వార్షిక చక్రవడ్డీ లభిస్తుంది.
- తెరిచిన నాటి నుంచి 15 యేళ్ల వరకు మాత్రమే పొదుపును చెల్లించాలి.
- మైనార్టీ తీరాక వివాహం కోసం అకౌంట్‌ను క్లోజ్ చేసుకోవచ్చు.

అకౌంట్ తెరిచేందుకు కావాల్సినవి

- బాలిక పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం
- తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లు
- తల్లి లేదా తండ్రి యొక్క రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

అవగాహన పెంచుతున్నాం



చింతలూరు పోస్టాఫీసు పరిధిలో 2000 వరకు ఎస్ఎస్ఏ అకౌంట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులకు మెరుగైన స్పందన వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 154 ఖాతాలు ప్రారంభిస్తే ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 186 ఖాతాలు ప్రారంభించాం.

– వి.కాశీకృష్ణ, పోస్టుమాస్టర్, సబ్ పోస్టాఫీసు, చింతలూరు

ఆడపిల్లల భవిష్యత్‌కు దోహదం



పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన అత్యుత్తమ పథకాల్లో ఎస్ఎస్‌వై పథకం ప్రత్యేకంగా నిలుస్తోంది.. ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ స్కీమును అమలు చేస్తోంది. ఈ పథకాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.కుమారి, యానిమేటర్, గుమ్మిలేరు

నేడు గుమ్మిలేరులో గడప గడపకూ..

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో తుదివిడత నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

స్వామి సన్నిధిలో 'తూర్పు' ఎస్పీ


ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డికి స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. నిత్యాన్నదానంలో సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామి ప్రసాదాన్ని తీసుకున్నారు.

ప్రగతికి చిరునామా... జగనన్న పాలన

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- మాచవరంలో గడప గడపకూ..

అంబాజీపేట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రగతికి చిరునామాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సీఎం జగన్ పాలనలో జరిగిన ప్రగతిని వివరిస్తూ, స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ, వినతులు స్వీకరించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి, సమస్యలు, బాగోగుల్ని అడిగి తెలుసుకుని లబ్ధిదారులకు బ్రోచర్ అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తూ సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నారన్నారు. వలంటీర్ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాల్ని అందిస్తున్నట్లు చెప్పారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాలనీల్లో డ్రైనేజీలు, పింఛన్లు రహదారులను, శ్రీరామ్‌నగర్‌లో శెట్టిబలిజ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యేకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ మట్టా పార్వతి, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను, చప్పిడి సుబ్రహ్మణ్యం, కుసుమ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

టెక్నీషియన్లను కార్మికులుగా గుర్తించాలి

మామిడికుదురు: ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి వారిని ఆదుకోవాలని స్థానికంగా ఆదివారం జరిగిన శ్రీసాయి గణేష్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ల అసోసియేషన్ సమావేశం డిమాండ్ చేసింది. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కండిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షుడు మంచిశెట్టి నటరాజ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ల పరిస్థితి అంతంత మాత్రంగా ఉందన్నారు. వారిని కార్మికులుగా గుర్తించి వారికి ప్రభుత్వం తరఫున సహాయం అందించాలన్నారు. టీవీ మెకానిక్‌లకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ట్రైనర్ రెడ్డి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు దొంగ ప్రసాద్, ఆరుమిల్లి ప్రసాద్, యల్.నాగేంద్రశర్మ, కొపనాతి లక్ష్మణరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ ప్రతినిధులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

విద్యార్థుల సేవా దృక్పథం అభినందనీయం


అవిడి చప్పిడివారిపాలెం హైస్కూల్ అండ్ కాలేజీలో సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం అరుణశ్రీ

కొత్తపేట: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న పూర్వ విద్యార్థుల సేవా దృక్పథం అభినందనీయమని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల అండ్ మహిళా జూనియర్ కళాశాల హెచ్‌ఎం కె.అరుణశ్రీ అన్నారు. మండలంలోని చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న ఆ పాఠశాలకు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం చేయాలనే సంకల్పంతో రూ.1.75 లక్షలతో విద్యార్థుల సైకిల్ స్టాండ్ నిర్మించారు. ఈ సైకిల్‌స్టాండ్‌ను ఆదివారం హెచ్‌ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటే సూర్యారావు, ఎండీ ఖాజామొహిద్దీన్, తాతారావు, పూర్వ విద్యార్థి నాయకులు కోట సత్యనారాయణ (టీచర్), దూళి సూరిబాబు (ఎంపీటీసీ), వేగేశ్న శ్రీరామచంద్రమూర్తి, సాదే గణేష్, పినిశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

మలికిపురం: మండలంలోని బీసీ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం విశ్వేశ్వరాయపురం శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో జరిగింది. బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా కంకటాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా చింతా జయప్రకాష్, గౌరవ అధ్యక్షుడిగా గుబ్బల సింహాచలం, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారుడిగా నాత్ర ఉమామహేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా కొప్పాడి శ్రీనివాస్, మహిళా కార్యదర్శులుగా రాయుడు శ్రీదేవి, కె.బేబీపద్మకుమారి ఎన్నికయ్యారు. జిల్లా బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ జనగణన నిర్వహించాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. జిల్లా సంఘ కార్యదర్శి కారాడి వెంకట నరసింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కంకటాల చంద్రశేఖర్

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

మామిడికుదురు: మొగలికుదురు రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణపై ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి బి.మృదుల ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఐదు ఎకరాలకు ఒక శాంపిల్ సేకరించాలన్నారు. ఈ మొత్తం భూమిలో పది నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలని సూచించారు. వి ఆకారంలో వరి చేలకు 15 సెంటీ మీటర్లు లోతు, పండ్ల తోటలకు ఆరుఅడుగుల లోతులో మట్టిని సేకరించాలని సూచించారు. వి ఆకారంలో చివరన ఉన్న మట్టిని సేకరించి, దాన్ని వాటరింగ్ పద్ధతిలో నాలుగు భాగాలుగా విభజించి రెండు భాగాలు మాత్రమే తీసుకుని దాన్ని నమూనాగా ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. సాయిల్ హెల్త్ కార్డు ఆధారంగా ఎరువుల వాడాల్సి ఉంటుందని మృదుల పేర్కొన్నారు. మట్టి నమూనాల సేకరణపై రైతుల్లో అవగాహన తీసుకువచ్చి వారిని చైతన్యవంతుల్ని చేయాలని ఏఓ సూచించారు.


మట్టి నమూనాలపై శిక్షణ ఇస్తున్న ఏఓ మృదుల

పదో తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఆలమూరు: పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నికల్, కెరీర్ గైడెన్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచితంగా శిక్షణ అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యాన సబ్జెక్టుల వారీగా చక్కని ప్రావీణ్యం కలిగిన అధ్యాపక బృందంతో ఈ శిక్షణను ఇవ్వనున్నారు. ఈనెల 17న తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని అధ్యక్షుడు వీరబ్రహ్మం ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ నిర్వహించే ఈ శిక్షణను అన్ని వర్గాల విద్యార్థులు ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతీరావుపూలే జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పాశర్లపూడి కుసుమ నగర్‌లో 18వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు కుసుమ వినోద్ ఆదివారం తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. సీనియర్స్ విభాగంలో విజేతలకు రూ.8 వేలు, 5 వేలు నగదు ప్రోత్సాహకాలతో పాటు షీల్డులను ప్రథమ, ద్వితీయ బహుమతులుగా అందిస్తామన్నారు. జూనియర్స్ విభాగంలో రూ.5 వేలు, రూ.3 వేలు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా నగదు ప్రోత్సాహాలతో పాటు షీల్డులు అందజేస్తామన్నారు. 18 ఏళ్ల లోపు వారిని జూనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. సీనియర్లకు వయస్సు పరిమితి లేదని, రాష్ట్ర క్రీడాకారులకు ప్రవేశం లేదని చెప్పారు. ఇతర వివరాల కొరకు కుసుమ మదన్‌మోహన్ సెల్ నంబర్ 96405 51331ను సంప్రదించాలని వినోద్ సూచించారు.

సీఆర్‌సీ యోగా మిత్రమండలి నూతన కార్యవర్గం ఎన్నిక

రావులపాలెం: కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ) యోగా మిత్ర మండలి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సీఆర్‌సీ యోగా మిత్రమండలి సర్వసభ్య సమావేశం జరిగింది. పాత కార్యవర్గం పదవీకాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కర్రి సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా మోటూరి సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడిగా సమయమంతుల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గునిశెట్టి నాగేంద్ర, కోశాధికారిగా చిర్ల కనికిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మోటూరి రామారావు, కార్యనిర్వహణ సభ్యులుగా పసుపులేటి రాధాకష్ట, కర్రి చిన్నభద్రారెడ్డి, బొక్కా పల్లంశెట్టి, సింగంశెట్టి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాస ఫణీందర్ రెడ్డిలను ఎన్నుకున్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన సీఆర్‌సీ యోగా మిత్రమండలి నూతన కార్యవర్గం సభ్యులు

మొసలపల్లి సర్పంచ్‌గా గోపీకృష్ణకు బాధ్యతలు

అంబాజీపేట: మొసలపల్లి ఉప సర్పంచ్ కట్టా గోపాలకృష్ణ గోఖలేకు సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారని పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి ఆదివారం తెలిపారు. సర్పంచ్ దంతులూరి ఉమాదేవి ఈ నెల 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు 5 నెలల పాటు కెనడా పర్యటనకు వెళుతుండటంతో జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్ చట్టం 1994, సెక్షన్ 26 (2) ప్రకారం ఉప సర్పంచ్ అయిన కట్టా గోపాలకృష్ణగోఖలేకు అధికారికంగా పంచాయతీ విధులు నిర్వహించేందుకు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కార్యదర్శి చెప్పారు. ఈ ఉత్తర్వులు సర్పంచ్ ఉమాదేవి కెనడా నుంచి తిరిగి వచ్చేంత వరకు అమలులో ఉంటాయని కలెక్టర్ తన ఆదేశాలలో పేర్కొన్నారన్నారు. ఆదివారం ఉప సర్పంచ్ అయిన గోపాలకృష్ణ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.


మొసలపల్లిలో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాలకృష్ణ గోఖలే

పలువురికి జెడ్పీ చైర్మన్ పరామర్శ

పి.గన్నవరం: ఎల్.గన్నవరం శివారు జొన్నల్లంకకి చెందిన పార్టీ నాయకుడు తిరుమాని ఆదినారాయణ (68) ఇటీవల మరణించగా, ఆయన కుమారులు బాల, శివయ్యలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం పరామర్శించారు. అలాగే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న పార్టీ కార్యకర్త కడలి శ్రీరామమూర్తి కుమారుడు రవిబాబును విప్పర్తి పరామర్శించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, గిడుగు రామకృష్ణ, పాటి చిట్టిబాబు, అడ్డగళ్ల శ్రీను పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

అయినవిల్లి/అంబాజీపేట/మలికిపురం/కొత్తపేట/ఆలమూరు/పి.గన్నవరం: రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పేదలు లక్షాధికారులు కావాలన్నా మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు కట్టబెట్టాలని రాజసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం మండలంలోని కె.జగన్నాథపురంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వారంతా గ్రామంలో పర్యటించి లబ్ధిదారులను నేరుగా వారి ఇంటి వద్దే కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. గ్రామాన్ని అనుకుని ఉన్న ముమ్మిడివరం–ముక్తేశ్వరం బీటీ రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి శ్రీను, వాసంశెట్టి చినబాబు, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మండల కేంద్రమైన ముక్తేశ్వరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య ఆస్పత్రిని ప్రారంభించారు. అంబాజీపేట మండలంలో ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం శివారు నందెప్ప వారిపాలెంలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మలికిపురం మండలం కేశనపల్లిలో వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్ ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీకే ప్రజలు ఓట్లు వేసి మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని కేశనపల్లి సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి అన్నారు. మండలంలోని కేశనపల్లిలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట మండలంలోని వాడపాలెంలో పార్టీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామ పెదపేటలో ఎంపీటీసీ నేలపూడి భీమరాజు ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో సచివాలయ కన్వనర్లు, గృహసారథులతో కలసి వారు పాల్గొన్నారు. మండలంలోని వాడపాలెం లాకుల వద్ద మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను, జెడ్పీ నిధులు రూ.2 లక్షలతో ప్రధాన గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధునీకరణ పనులను వారు ప్రారంభించారు. ఆలమూరు మండలం పెనికేరులో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ శ్రేణులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహసారథులంతా గ్రామంలో పర్యటించి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పి.గన్నవరంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్ కొక్కిరి రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.


మాచవరంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్‌కు ఎంపీల పరామర్శ

అంబాజీపేట: మాతృవియోగంతో బాధపడుతున్న అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాసంశెట్టి వరలక్ష్మిని ఆమె భర్త చినబాబులను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధలు ఆమె స్వగృహం వద్ద ఆదివారం పరామర్శించారు. వరలక్ష్మి తల్లి కుడుపూడి నాగరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కొర్లపాటి కోటబాబు, గుత్తుల నాగబాబు, సూదాబత్తుల రాము తదితరులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.